ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహిస్తా: కౌసర్



గోల్కొండ: ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహిస్తానని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. కార్వాన్ సబ్జిమండిలోని వీరాభిమన్యు వ్యాయామ శాలలో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రెజ్లింగ్ పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన క్రీడాసామగ్రిని అందిస్తామన్నారు. ఇప్పటికే గోల్కొండ, లంగర్‌హౌస్ డివిజన్లలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రన్నింగ్, లాంగ్ జంప్, ఇండోర్ క్రీడా అంశాల్లో ఆయా పాఠశాలల అధ్యాపక బృందం ప్రోత్సహిస్తుందని ఆయన అన్నారు. వివిధ రకాల క్యాటగిరిల్లో గుర్రం సురక్షిత్‌కుమార్, 125 కిలోల విభాగంలో ఆయూష్‌సింగ్, 97 కిలోల విభాగంలో ఆయూష్ గుప్తా, 61 కేజీల విభాగంలో సంజయ్ తదితరులు స్వర్ణ పతకాలు సాధించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నర్సింహులు, కోచ్ కట్టా శ్రీనివాస్, బాలరాజ్, శ్యామ్‌రావు, హరికృష్ణ తదితరులున్నారు.

హోటల్స్, లాడ్జీలలో దిగే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలి



మాట్లాడుతున్న డీసీపీ ఎస్.ఎం.విజయ్‌కుమార్

నాంపల్లి: హోటల్స్, చిన్నపాటి లాడ్జీలలో దిగే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని డీసీపీ ఎస్.ఎం.విజయ్ కుమార్ హోటల్ నిర్వాహకులను ఆదేశించారు. ఈ మేరకు స్థానిక బంజారాహిల్స్ ఫంక్షన్ హాల్‌లో హోటల్స్ నిర్వాహకులు, మేనేజర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డీసీపీ ఎస్.ఎం.విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. లాడ్జీలు, హోటల్స్‌లో దిగే అనుమానితులకు గదులను కేటాయించవద్దని ఆదేశించారు. అనుమానితులను గుర్తిస్తే వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే రెస్టారెంట్ల నుంచి వెలువడి వ్యర్థాల తరలింపు విషయంలో జాగ్రత్త వహించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ వెంకట్‌రెడ్డి, మాసాబ్‌ట్యాంక్ ఇన్‌స్పెక్టర్ సి.పరశురామ్, బంజారాహిల్స్ డీఐ బషీర్ అహ్మద్, ఎస్‌ఐలు జి.శేఖర్, ఎం.సతీష్, సయీద్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



కార్యక్రమంలో సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ చంద్రమోహన్

గోల్కొండ: కాలనీల వారితో పాటు ఆలయాలు, మసీదుల నిర్వాహకులు తమతమ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ చంద్రమోహన్ అన్నారు. శుక్రవారం గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు, ఆలయాలు, మసీదుల నిర్వాహకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసాంఘిక కార్యకలాపాలు సాగించే వారి ఆటకట్టించాలంటే సీసీ కెమెరాల ఏర్పాటు ఒకటే పరిష్కార మార్గం అన్నారు. తమతమ ప్రాంతంలోని మసీదులు, ఆలయాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుకు కాలనీ సంక్షేమ సంఘాలు, మసీదులు, ఆలయ కమిటీల వారు ఆయా ప్రాంతాల ప్రజలను సంప్రదించి వెంటనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ విషయంలో అవసరమైతే పోలీసులు తమ సహాయ సహకారాలు అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్, గోల్కొండ ఇన్‌స్పెక్టర్ సైదులు, ఎస్సై రఫీ, షానవాజ్‌ఖాన్, పరమానందం తదితరులున్నారు.

నామినేషన్లకు ఆహ్వానం

లక్డీకాపూల్: లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్‌లో పని చేయడానికి ఆసక్తి ఉన్న వారు నామినేషన్లు సమర్పించాలని అసోసియేషన్ ప్రస్తుత అధ్యక్షుడు డాక్టర్ శ్రీకాంత్ కోరారు. ప్రతిష్టాత్మక ఈ ఎగ్జిక్యూటివ్ కమిటీలో సేవ చేయడానికి ఉత్సాహం ఉన్న పురుషులు, మహిళలను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ఇది పూర్వ విద్యార్థులకు తిరిగి కలిసే ఒక అవకాశం అన్నారు. ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీ, ట్రెజరర్, ఆరుగురు కమిటీ సభ్యులు కోసం నామినేషన్ వేయవచ్చన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా 2017కి ముందు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన పూర్వ విద్యార్థులై ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న వారు తమ నామినేషన్ దరఖాస్తులను వ్యక్తిగతంగా లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ ఓల్డ్ స్టూడెంట్ అసోసియేషన్ చైర్మన్, ప్రిన్సిపాల్ రెవ్ బ్రో షాజన్ ఆంథోనీకి సమర్పించవచ్చన్నారు. వీరు చీఫ్ ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్‌గా కూడా వ్యవహరిస్తారని తెలిపారు. లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ వార్షిక జనరల్ బాడీ సమావేశం ఈనెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు అబిడ్స్‌లోని స్కూల్‌లో జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో 2022–2024 కాలానికి వార్షిక ఖాతాల ప్రదర్శన, కొత్త ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుల ఎన్నిక, అసోసియేషన్ ఉప చట్టాలకు సవరణలతో సహా ఏవైనా ఇతర ముఖ్యమైన విషయాలపై చర్చ ఉంటుందన్నారు. మరింత సమాచారం కోసం www.liflos.org, 040–23202675లలో సంప్రదించవచ్చన్నారు.

అనితకు డాక్టరేట్

నాంపల్లి: క్రీడాకారిణి పసుపుల అనిత ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) అందుకున్నారు. ప్రొఫెసర్ రాజేష్ కుమార్ పర్యవేక్షణలో తైక్వాండో ప్లేయర్స్‌లో ఫిజికల్ అండ్ ఫిజియోలాజికల్ వేరియబుల్స్‌పై పరిశోధన చేసింది. ఈ పరిశోధనకు ఆమెకు డాక్టర్ లభించింది. ప్రఖ్యాత క్రీడాకారిణిగా, పరిశోధకురాలిగా, డాక్టర్ అనిత జాతీయ స్థాయి తైక్వాండో క్రీడాకారిణిగా రాణించి అనేక అవార్డులు అందుకున్నారు. ఆమె విద్యాభ్యాసం సికింద్రాబాదులోని కీస్ హైస్కూల్‌లో జరిగింది.



డాక్టరేట్‌ను అందుకుంటున్న అనిత

సన్మానం



లంగర్‌హౌస్: దసరా సందర్భంగా తక్కువ సమయంలో పూర్తిగా సహకరించి ఏర్పాట్లు చేయించి ఎమ్మెల్యే కౌసర్ సేవా, సమయస్ఫూర్తి చాటుకున్నారని లంగర్ హౌస్ దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బోగి బాల్ రాజ్ అన్నారు. బతుకమ్మ, దసరా ఉత్సవాలు విజయవంతంగా ముగియడంతో అందులో సహకారం అందించినందుకు ఆయన ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. కార్పొరేటర్లు, దసరా ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి అనిల్, కోశాధికారి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

జర్నలిస్టు కుటుంబాన్ని ఆదుకోవాలి

చార్మినార్: సీనియర్ జర్నలిస్టు, తెలంగాణ మలిదశ ఉద్యమ కాలంలో ఒక దశాబ్దం కన్నా ఎక్కువగా రాష్ట్ర సాధన కోసం పని చేసిన ప్రజా టైమ్స్ ఎడిటర్ పోగుల రాములు గౌడ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంపై పలువురు తీవ్ర సంతాపం తెలిపారు. తన పత్రిక ద్వారా ప్రజా చైతన్యం తేవడంలో ఎనలేని కృషి చేసిన ఆయన మరణం పత్రికారంగానికి తీరని లోటని సీనియర్ జర్నలిస్టు, హైదరాబాద్ రైటర్స్ అండ్ ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.సూర్యప్రకాష్, ప్రజా చైతన్య సమితి అధ్యక్షుడు గడ్డమీది చంద్రమోహన్‌గౌడ్ తదితరులు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఆయన కుమారునికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలన్నారు.

వాటర్‌బోర్డులో ఏఎంఎస్ విధానాన్ని రద్దు చేయాలి



వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: వాటర్‌బోర్డులో ఏఎంఎస్ విధానాన్ని రద్దు చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఏఎంఎస్ విధానంతో వందలాది మంది కాంట్రాక్టర్లు రోడ్డు పాలయ్యారన్నారు. వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డికి పోల్కం శ్రీనివాస్ మెమోరాండం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన ఏఎంఎస్ (యాన్యువల్ మెయింటెనెన్స్ సిస్టమ్) విధానంతో చిన్నా చితకా కాంట్రాక్టర్లు అప్పులపాలయ్యారన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో కాంట్రాక్టర్లందరికీ న్యాయం జరగాలని ఆయన పేర్కొన్నారు. వాటర్‌బోర్డు ఎండీ ఏఎంఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపెన్ టెండర్ సిస్టమ్‌ను అమలు చేయాలన్నారు. అదేవిధంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో వందలాది మంది కాంట్రాక్టర్లు ఇంకా బిల్లులు చెల్లించలేదన్నారు. పాత బకాయిలు వెంటనే చెల్లించి కాంట్రాక్టర్లను ఆదుకోవాలని పోల్కం శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎండీ అశోక్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని పోల్కం శ్రీనివాస్ వెల్లడించారు.

గుడిమల్కాపూర్ పూల మార్కెట్‌లో కుళ్లిన పూల కుప్పలు



కూరగాయల మార్కెట్‌లో తరలించని వ్యర్థాలు



పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం

- అధ్వానంగా గుడిమల్కాపూర్ పూల మార్కెట్
- కూరగాయల మార్కెట్‌లో పడకేసిన పారిశుద్ధ్యం
- బడా మార్కెట్‌లలో అధికారుల పర్యవేక్షణ శూన్యం
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు

గోల్కొండ: రాష్ట్రంలోనే అతి పెద్దదైన గుడిమల్కాపూర్‌లోని పి.ఇంద్రారెడ్డి పూలమార్కెట్ అధ్వానంగా తయారైంది. వివిధ రకాల పూలు భారీ ఎత్తున అమ్ముడయ్యే ఈ మార్కెట్‌లో సుగంధాల జాగాలో కుళ్లిన పూలు దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. క్వింటాళ్ల కొద్ది కుళ్లిన వివిధ రకాల పూల కుప్పలు రోజురోజుకూ పెరుకుపోతున్నాయి. మరో వైపు గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్ సైతం అపరిశుభ్రతకు నిలయంగా మారింది. ప్రతినిత్యం వేల టన్నుల కూరగాయలు ఈ మార్కెట్‌కు రైతులు తెస్తుంటారు. కుళ్లిన కూరగాయలు, ఇతర చెత్త పూలమార్కెట్ ప్రహరీ పొడవునా డంపింగ్ చేస్తున్నారు. వ్యర్థాలను తొలగించే శ్రద్ధ అధికారులకు లేకపోవడంతో రోజుల తరబడి కుళ్లిన కూరగాయలు అలాగే పడి ఉంటున్నాయి.

పూల మార్కెట్ దుస్థితి..

ఇంద్రారెడ్డి పూలమార్కెట్ పైన పటారం లోన లొటారం అన్న చందంగా మారింది. మెయిన్ గేటులోంచి లోపలికి వెళ్లగానే వివిధ రకాల పూల గుట్టలు అమ్మకానికి కానవస్తాయి. అదే విధంగా వివిధ రకాల పూల మాలలు, అందంగా తయారు చేసిన బోకేలు ఆకట్టుకుంటాయి. అయితే మార్కెట్ వెనుక భాగంలో కుళ్లిన పూల నుంచి వచ్చే దుర్గంధం ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. నామ్‌కే వాస్తే ఈ మార్కెట్‌లో వ్యర్థాలు తరలించే పనులు జరుగుతున్నాయి. సరైన అధికార యంత్రాంగం లేకపోవడంతో ఈ మార్కెట్‌లో వ్యర్థాలు కుప్పలు తెప్పలుగా డంపింగ్ అవుతున్నాయి.

కూరగాయల మార్కెట్‌లో సైతం..

గుడిమల్కాపూర్‌లోని కూరగాయల మార్కెట్ నిర్వహణ సైతం అస్తవ్యస్తంగా తయారైంది. నగర శివారు ప్రాంతాల్లోని రైతులు అమ్మకానికి తెచ్చిన కూరగాయలను ఈ మార్కెట్‌కు తెచ్చి అమ్ముతారు. రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు భారీ ఎత్తున హోల్‌సెల్‌గా కూరగాయలను ఏజెంట్లు అమ్ముతారు. అయితే ఉదయం కాగానే కూరగాయల మార్కెట్‌లో రిటేల్‌గా కూరగాయలు అమ్ముతుంటారు. కుళ్లిపోయిన టమాటాలు, ఆకుకూరలు మార్కెట్ వెనుక భాగం ప్రహరీ ప్రాంతంలో పారబోస్తున్నారు. ఇది కాస్తా కుళ్లి దుర్గంధం వ్యాపిస్తుంది. గాలి వచ్చినప్పుడు దుర్గంధం మొత్తం మార్కెట్ యార్డులో వ్యాపిస్తుంది. చిల్లర కూరగాయల వ్యాపారులు, కుళ్లిన టమాటలు, ఇతర కూరగాయలను ఎక్కడపడితే అక్కడే వదిలేస్తున్నారు. వీధి జంతువులు, ద్విచక్ర వాహనాదారులు తదితరవి మార్కెట్‌లో కుళ్లిన కూరగాయల పైనుంచే రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో పాదచారులు ఇబ్బందులు పడుతుంటారు. కూరగాయల మార్కెట్‌లో పోలీస్‌స్టేషన్ ఉంది. అయితే పోలీస్‌స్టేషన్ పరిసరాల్లో సైతం చెత్త కుప్పలు, కుళ్లిన కూరగాయల కుప్పలు పడి ఉంటున్నా కూడా ఎవరు పట్టించుకోవడం లేదు. మార్కెట్ కమిటీ కార్యాలయం కూడా మార్కెట్ యార్డులో ఉన్నా కూడా అధికారి, సిబ్బంది పారిశుద్ధ్య పనులపై శ్రద్ధ కనబరచడం లేదని మార్కెట్‌కు వచ్చే పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

24న స్వర నీరాజనం

గన్‌ఫౌండ్రీ: ఈ నెల 24న రవీంద్రభారతిలో వంశీ ఇంటర్నేషనల్ (ఇండియా), శారద ఆకునూరి (అమెరికా)ల ఆధ్వర్యంలో సినీగేయ కవి మైలవరపు గోపికి స్వర నీరాజనం నిర్వహిస్తున్నట్లు వంశీ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు వంశీ రామరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి సినీ దర్శకుడు రేలంగి నర్సింహారావు, శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్, నృత్య దర్శకురాలు సుచిత్ర చంద్రబోస్‌లతో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. 'మనసా కవ్వించకే నన్నిలా'పేరిట సినీ సంగీత విభావరి ఉంటుందని తెలిపారు.

మూసీనదిపై పుస్తక ప్రచురణకు రచనల ఆహ్వానం

యాకుత్‌పురా: మూసీనదిపై రూపొందించనున్న పుస్తకంలో ప్రచురణకు రచనలు, కథ, కవితలను ఆహ్వానించనున్నమని చంద్రిక గ్రథ మండలి సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ విజయ్‌భాస్కర్, డాక్టర్ వేముల నారాయణ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ..భాగ్యనగరంలో ప్రవహించే మూసీనది సుందరీకరణ, ప్రక్షాళనపై జరుగుతున్న వాద ప్రతివాదాల నేపథ్యంలో మానవ మనుగడకు ముఖ్యమైన నీటిని సమకూర్చే వాగులు, వంకలు, నదులు, జీవనదుల ప్రాధాన్యతను సాహిత్య రూపంలో రూపొందించనున్నామన్నారు. మూసీనదిపై ఈ పుస్తకంలో పొందుపరిచేందుకు కవిత, కథ, పద్యం, గేయం ఏదైన సాహిత్య రూపంలో రాసి ఈ నెల 30వ తేదీ లోగా cgmts2017@gmail.com మెయిల్ ద్వారా పంపాలని కోరారు.

దీపావళికి శ్మశానవాటికలో సదుపాయాలు కల్పించాలి

చాంద్రాయణగుట్ట: దీపావళికి శ్మశాన వాటికలో సదుపాయాలు కల్పించాలని బేడ బుడగ జంగం జంగమ్మెట్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కప్పరి మధు, నిదానకవి శ్రీనివాస్‌లు కోరారు. ఈ మేరకు శుక్రవారం వారు జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్నను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ.. దీపావళిని పురస్కరించుకొని శ్మశాన వాటికలో తమ పూర్వీకులకు రెండు రోజుల పాటు పూజలు చేయడం అనాధిగా వస్తుందన్నారు. శ్మశానవాటికలో చెత్తాచెదారాలు లేకుండా చూడడంతో పాటు వీధి దీపాలు ఏర్పాట్లు, చెట్లను కటింగ్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

నూతన న్యాయదేవత విగ్రహం ఏర్పాటు అభినందనీయం

యాకుత్‌పురా: చట్టం ఎప్పుడూ గుడ్డిది కాదని, అది అందరిని సమానంగా చూస్తుందని చాటి చెప్పేందుకు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నూతన న్యాయ దేవత విగ్ర హం ఏర్పాటు చేయడం శుభపరిణమమని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ..బ్రిటిష్ వారసత్వం నుంచి భారతదేశ న్యాయ వ్యవస్థ బయటపడాలనే ఉద్దేశంతో పాటు చట్టం ఎప్పుడూ అందరికీ సమానంగా ఉంటుందని చెప్పేందుకు ప్రధాన న్యాయమూర్తి తీసుకున్న చర్యను అభినందిస్తున్నామన్నారు.

65 అడుగుల దుర్గామాత చిత్రపటం అందజేత



అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న కళాకారిణి లావణ్య

సుల్తాన్‌బజార్: ప్రపంచంలోనే అతిపెద్ద దుర్గామాత విగ్రహానికి ఎంతో ప్రాచుర్యం లభించింది. నగరానికి చెందిన ప్రముఖ ఆర్టిస్ట్ లావణ్య విక్టరీ ప్లే గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన 65 అడుగుల దుర్గామాత విగ్రహాన్ని తన పెయింటింగ్ రూపంలో చిత్రీకరించి నవదుర్గ నవరాత్రి ఉత్సవ సమితి అధ్యక్షుడు గులాబ్ శ్రీనివాస్‌కు బహూకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..తాను యాదగిరిగుట్ట, తిరుపతి, స్వర్ణగిరి లాంటి ఆలయాల చిత్రాలు గీశానని తెలిపారు. తనను ఎంతో ఆకర్షించిన 65 అడుగుల విగ్రహం చిత్రీకరించి నిర్వాహకులకు అందజేయడం సంతోషంగా ఉందన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన



సభ్యత్వ నమోదులో మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతామూర్తి

గోల్కొండ: బీజేపీ సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతామూర్తి అన్నారు. బీజేపీ కార్వాన్ డివిజన్ అధ్యక్షుడు దోర్నల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం న్యూ గంగానగర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలు తమ వద్దకు వచ్చి సభ్యత్వం తీసుకుంటున్నారన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు పట్ల విసుగు చెందిన ప్రజలు తమ పార్టీని ఆదరిస్తున్నారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ పార్లమెంట్ కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, బీజేపీ కార్వాన్ నియోజకవర్గం కన్వీనర్ గోవర్ధన్, నాయకులు అశోక్ తదితరులున్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



గోల్కొండ: ట్రాఫిక్ నిబంధనలు అందరికీ వర్తిస్తాయని నార్త్ జోన్ ఏసీపీ జి.శంకర్‌రాజు అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాల నివారణకు శుక్రవారం ఆయన మెహిదీపట్నం బైసన్ డివిజన్ 47 ఇన్ ఫ్యాంట్రీ ఆర్మీ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపడం నేరమని అదే విధంగా ద్విచక్ర వాహనం నడిపే సమయంలో వాహనంపై వెనుక కూర్చున్న వ్యక్తి కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్రిగేడియర్ సంజయ్ వి కులకర్ణి, కల్నల్ ఎస్.ఎస్.గులియానీ, గోషామహల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



శేషాద్రికి మెమోరాండం అందజేస్తున్న టీఎన్జీఓస్ కేంద్ర సంఘం నాయకులు

అఫ్జల్‌గంజ్: ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎన్జీఓస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేన్ పేర్కొన్నారు. ప్రిన్సిపల్ సెక్రెటరి శేషాద్రికి వారు మెమోరాండం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలన్ని వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. టీఎన్జీఓస్ యూనియన్ ఉద్యోగులకు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నరేష్, వెంకట్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మాజీ ముఖ్యమంత్రి అంజయ్యకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న మణిలాల్‌షా, ఆలం భాస్కర్ తదితరులు

అబిడ్స్: రాష్ట్ర మాజీ దివంగత ముఖ్యమంత్రి టి.అంజయ్య వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గాంధీభవన్‌లో జరిగిన ఈ వేడుకల్లో టీపీసీసీ కార్యదర్శి మణిలాల్‌షా, రాష్ట్ర నాయకులు ఆలం భాస్కర్, విజయవర్ధన్ నాయుడు, శ్రీనివాస్ రెడ్డి, రాములు అంజయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేద ప్రజల అభివృద్ధికి, రాష్ట్ర సంక్షేమానికి దివంగత అంజయ్య చేసిన కృషిని వారు కొనియాడారు.

నేడు కార్వాన్‌లో కిషన్‌రెడ్డి పర్యటన

లంగర్‌హౌస్: నేడు కార్వాన్ నియోజకవర్గంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పర్యటించనున్నారని హైదరాబాద్ పార్లమెంట్ కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, లంగర్‌హౌస్ డివిజన్ అధ్యక్షుడు నాగేంద్రప్రకాష్‌రెడ్డి అన్నారు. మూసీ బాధితులకు భరోసా కల్పించేందుకు శనివారం ఆయన పర్యటించనున్నట్లు లంగర్‌హౌస్‌లో సమావేశంలో తెలిపారు. వారు మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ పునరుజ్జీవనం పేరుతో పేదల ఇళ్లను కూల్చి వారిని రోడ్డున పడేస్తున్నారన్నారు. మూసీ బాధితులతో కలిసి వారికి భరోసా కల్పించడానికి కిషన్‌రెడ్డి పర్యటిస్తున్నారన్నారు. శనివారం ఉదయం 11 గంటలకు రాందేవ్‌గుడ, లంగర్‌హౌస్ డిఫెన్స్ కాలనీ, అంబేడ్కర్‌నగర్ అనంతరం కార్వాన్, జియగుడలో పర్యటిస్తారన్నారు.

జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు అభినందనలు



కమిషనర్‌కు మొక్కను అందజేస్తున్న ఆదిల్ షరీఫ్ తదితరులు

అబిడ్స్: జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ జీహెచ్‌ఎంసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ ఆధ్వర్యంలో మొక్కను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు మోజస్, శివకుమార్, ఉమేష్ బాబు, మహ్మద్ రఫీక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీగా బండి సంజయ్ గెలిచినందుకు శబరిమలకు పాదయాత్ర

గౌలిపురా: కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ తిరుగులేని విజయం సాధించినందుకు శబరిమలకు బీజేపీ యువ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి అల్లి శివచంద్రగిరి పాదయాత్రగా వెళ్లారు. శుక్రవారం గౌలిపురా అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా శివచంద్రగిరి మాట్లాడుతూ..తెలంగాణలో ఇటీవల మేలో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కరీంనగర్ ఎంపీగా గెలుపొందితే శబరిమలకు పాదయాత్రగా వస్తానని మొక్కడంతో తన మొక్కును నెరవేర్చుకోవడానికి పాదయాత్రగా వెళుతున్నానని తెలిపారు.

సందేశాత్మక చిత్రాలు రావాలి

తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ

గన్‌ఫౌండ్రీ: ప్రస్తుత సమాజంలో సందేశాత్మక చిత్రాలు రావాల్సిన అవసరం ఎంతగానో ఉందని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. శుక్రవారం రవీంద్ర భారతిలో నీలం నరేష్ రచించిన 'ది కంట్రీ సైడ్ పో రైట్'లఘు చిత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నిరుద్యోగం వల్ల పేదరికం ఏర్పడితే ఈ పేదరికంలో నుంచి జరిగే నేరాలు ఎలా ఉంటాయని నిజ జీవితంలో జరిగిన ఘటనల ఆధారంగా సినిమాలు తీయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సినీనటులు మైమ్ మధు, అంజి, నాటక దర్శకుడు మంకెనపల్లి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి



జియాగూడ: వాల్మీకి రచించిన రామాయణం నేటికీ స్ఫూర్తిదాయకమని మెథర్ ప్రగతి సంఘ్, ఆలయ అధ్యక్షుడు విజయ్ రిడ్‌లాన్ అన్నారు. జియాగూడలోని సంజయ్‌నగర్ వాల్మీకినగర్‌లోని వాల్మీకి మందిరంలో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సమాజ్ సభ్యులు రాజేందర్ చిందాలియా, అజాద్ సింగ్ దుల్గజ్, రాజు బైడ్, మోను బిడ్‌లాన్, సందీప్ హత్వాల్, మనోజ్ బిడ్‌లాన్, నరేందర్ రిడ్‌లాన్, అజయ్ హత్వాల్, రాజు బైడ్, నవీన్ భగాడి తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో సత్తాచాటిన సుకన్య



గన్‌ఫౌండ్రీ: గోవాలో జరుగుతున్న పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో నగరానికి చెందిన క్రీడాకారిణి తేజావత్ సుకన్యబాయి సత్తాచాటింది. 76 కిలోల మహిళల విభాగంలో కాంస్య పతకాన్ని సాధించి 3వ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా శుక్రవారం ఆమెను పలువురు అభినందించారు. రాబోయే రోజుల్లో మరిన్ని పతకాలను సాధించి నగరానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

'దేవతా విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి'



దేవర శ్రీనివాస్

గోల్కొండ: తెలంగాణలో ముఖ్యంగా హైదరాబాద్‌లో సంఘ విద్రోహ శక్తులు దేవత విగ్రహాలను ధ్వంసం చేస్తున్నారని ఇటువంటి వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆయన ఓ ప్రకటనలో దేవత విగ్రహాల ధ్వంసాన్ని తీవ్రంగా ఖండించారు. పోలీసులు తమ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించడమే ప్రధాన కారణమని ఆయన అన్నారు. ఓ రోజు ఎగ్జిబిషన్ గ్రౌండ్, మరో రోజు మాసబ్‌ట్యాంక్ అమ్మవారి విగ్రహం ఆవరణను అపరిశుభ్రం చేయడం లాంటి ఘటనలు హిందూ మనోభావాలను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని ఆయన ఆరోపించారు.

ప్రభాకర్‌రావుకు గ్లోబల్ శాంతి పురస్కారం



గౌలిపురా: గౌలిపురాకు చెందిన జ్ఞాన భారతి మోడల్ హైస్కూల్ ప్రిన్సిపాల్, ప్రముఖ విద్యావేత్త వి.ప్రభాకర్‌రావు తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా మహాత్మా గాంధీ గ్లోబల్ పీస్ పురస్కారం –2024కు ఎంపిక చేసినట్లు తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ తెలిపారు. ఈనెల 22న ఉదయం 11 గంటలకు బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో మహాత్మా గాంధీ జయంతి, అంతర్జాతీయ శాంతి దినోత్సవం ముగింపు ఉత్సవాలను పురస్కరించుకొని ఈ అవార్డును బహూకరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్, మాజీ పార్లమెంటు సభ్యులు, శాసనమండలి సభ్యులు డాక్టర్ బండ ప్రకాశ్, రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొంటారన్నారు.